సాక్షి ప్రకాశం
ఆదివారం । 1 । జూన్ । 2025



జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యం

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు.

- 8లో..



రోడ్డెక్కిన పొగాకు రైతు

వ్యాపారుల ధోరణితో సహనం నశించిన పొగాకు రైతులు కొండపిలో రోడ్డుపై భైఠాయించి నిరసన తెలిపారు.

- 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36 /25

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

గంజివారిపల్లిలో పులి కలకలం



పులి అడుగు జాడలను పరిశీలిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

యర్రగొండపాలెం: మండలంలోని గంజివారిపల్లిలో పులి కలకలం రేపింది. మూడు రోజుల క్రితం గంజివారిపల్లి నుంచి కొలుకుల వెళ్లే దారిలో ఉన్న పొలాల్లో పులి సంచరించినట్లు పుకార్లు షికార్లు చేశాయి. ఈ మేరకు అటవీ శాఖాధికారులు తమ సిబ్బందితో ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అయితే వారికి పులి సంచరించినట్లు ఎటువంటి ఆనవాళ్లు కనిపించలేదు. పులి సంచరించినట్లు వచ్చిన సమాచారం మేరకు ఆయా ప్రాంతాల్లోని అటవీ శివారు ప్రాంతాలతోపాటు పొలాలను పరిశీలించామని, పులి అడుగు జాడలు తమకు కనిపించలేదని గంజివారిపల్లె రేంజర్ సుబ్బారావు తెలిపారు. పొలం పనులకు వెళ్లే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలని, పులి జాడ తెలిసిన వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

పీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా సీతారామయ్య

ఒంగోలు సబర్బన్: ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్‌గా డాక్టర్ కామేపల్లి సీతారామయ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. కష్టపడి పని చేసి బ్యాంకును అభివృద్ధి బాటలో నడిపిస్తామని అన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ కుంభా రాఘవయ్య, అధికారులు ఎన్.ఇందిరా దేవి, బ్యాంకు డీజీఎమ్, ఏజీఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.


రంగనాయకుని దర్శనానికి పోటెత్తిన భక్తులు



నీటి గుండం వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. తొలుత నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయం సమీపంలోని నీటిగుండంలో స్నానాలు ఆచరించి, గంటల తరబడి క్యూలో నిలబడి స్వామి దర్శనం చేసుకున్నారు. ఆలయ అర్చకులు అన్నవరం పాండురంగ చార్యులు, సత్యనారాయణచార్యులు ఆధ్వర్యంలో నెమలిగుండ్ల రంగనాయకస్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూల అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. స్వామి వారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు కృష్ణదేవరాయుల కాపుబలిజ, గోపాలకృష్ణ యాదవ, కాశినాయన, యోగి వేమన రెడ్ల, ఆర్యవైశ్య అన్నదాన సత్రాల్లో అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఎడ్ల పందేల విజేత కర్నూలు ఎడ్లజత



విజేతలకు బహుమతి అందచేస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులో నీలంపాటి అమ్మవారి ఆలయ 15వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు నిర్వహించారు. కర్నూలు జిల్లా పాణ్యంకు చెందిన సుబ్రమణ్యేశ్వరరెడ్డి ఎడ్లజత మొదటి బహుమతిని, బాపట్ల జిల్లా బల్లికురవకు చెందిన పాలూరి వీరయ్య చౌదరికి చెందిన ఎడ్ల జత ద్వితీయ బహుమతిని, కర్నూలు జిల్లా మిడుతూరుకు చెందిన రోలిమెడం ఎడ్ల జత తృతీయ బహుమతి సాధించారు. విజేతలకు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు బహుమతులు అందజేశారు. తొలుత ఆలయంలో అన్నా రాంబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ మురారి, ఎంపీపీ రామసుబ్బారెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు రామచంద్రారెడ్డి, గాయం శ్రీనివాసరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సర్పంచ్ పీ వరాలు, వైస్ సర్పంచ్ సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎడ్ల పందెం నిర్వాహకులు వెన్న చిన్న సత్యనారాయణ రెడ్డి, ఏరువ మల్లారెడ్డిలను, ట్రాక్టరు దాతలు అశోక్‌రెడ్డి, నాగార్జునరెడ్డిలను మాజీ ఎమ్మెల్యే అన్నా అభినందించారు.

ప్రభుత్వం పనిచేయకపోతే ప్రశ్నిస్తా అంటూ గతంలో హడావుడి చేశారు. నేడు అధికారంలోకి వచ్చాక ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారిపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వేధింపులకు పాల్పడుతున్నారు. పోలీసు యంత్రాంగాన్ని చేతుల్లో ఉంచుకుని అక్రమ కేసులు పెడుతూ జైళ్లకు పంపుతున్నారు. అలా జిల్లాలో చాలా మందిపై కేసులు పెట్టారు. ప్రతిపక్ష పార్టీ నేతల దగ్గర నుంచి సోషల్‌మీడియా కార్యకర్తలపైనా కేసులు పెట్టి తీవ్రంగా వేధిస్తున్నారు.



ఆస్పత్రిలో ఉంటే...

పేరు ప్రవీణ్ కుమార్ రెడ్డి కడప జిల్లాకు చెందిన వ్యక్తి. బీటెక్ చేసి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. వినాయక చవితి పండుగ సమయంలో విగ్రహం ఏర్పాటుకు డబ్బులు వసూలు చేయడాన్ని ప్రశ్నించాడు. అది కూటమి పాలకులకు పెద్ద నేరంగా కనిపించింది. అతడి మీద సంతనూతలపాడు పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేయించింది. తిరుపతిలో మరో కేసు బనాయించింది. ఈలోపు అనుకోకుండా సదరు యువకుడికి ఆరోగ్యం దెబ్బతింది. దాంతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స కోసం వెళ్లాడు. వైద్యులు అతడికి ఆపరేషన్ చేయాలని నిర్ధారించారు. దాంతో ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాడు. అతడిని అరెస్టు చేసేందుకు తిరుపతి పోలీసులు ఆస్పత్రికి వెళ్లారంటే రెడ్‌బుక్ రాజ్యాంగం దుర్మార్గాలను అర్థం చేసుకోవచ్చు. ఆపరేషన్ తరువాత ప్రవీణ్ కుమార్ రెడ్డి ఒంగోలు రూరల్ పోలీసు స్టేషన్‌కు వచ్చి సీఐ ఎదుట విచారణకు హాజరయ్యాడు.

సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మపై కేసు



విచారణ నిమిత్తం ఒంగోలు రూరల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన రాంగోపాల్ వర్మ (ఫైల్)

ప్రముఖ సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ మీద మద్దిపాడు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయడం ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌ల చిత్రాలను మార్ఫింగ్ చేసినట్లు ఆయన మీద అభియోగాలు మోపారు. విచారణకు ఒంగోలుకు రావల్సిందిగా గత ఏడాది నవంబరు 25వ తేదీన నోటీసు ఇచ్చారు. సినిమా షూటింగులతో బిజీగా ఉన్న ఆయన విచారణకు హాజరుకాలేదు. దాంతో ఇద్దరు ఎస్‌ఐలు, నలుగురు కానిస్టేబుళ్లను హైదరాబాద్‌కు పంపించి రచ్చ రచ్చ చేశారు. మీడియాలో లీకులు ఇచ్చి వర్మను ఇబ్బంది పెట్టేందుకు ప్రయత్నాలు చేశారు. దాంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. తాను విచారణలో పోలీసులకు సహకరిస్తానని చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరి 7వ తేదీన ఒంగోలు రూరల్ పోలీసు స్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు విచారణకు వచ్చిన ఆయనను రాత్రి 9 గంటల వరకు విచారించారు. వర్మలాంటి పెద్ద దర్శకుడిని ఇబ్బంది పెట్టేందుకే కేసు పెట్టారన్న విమర్శలు వచ్చాయి.



ప్రశ్నించే గొంతునొక్కి.. పాలన ఎరుపెక్కి!

- హామీలు అమలు చేయని ప్రభుత్వాన్ని నిలదీస్తున్న వారిపై కేసుల కత్తి
- యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌పై తొమ్మిది కేసులు
- వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిపై కేసులు
- సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మపైనా కేసులు
- సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు పెట్టి వేధింపులు
- రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుపై వెల్లువెత్తుతున్న వ్యతిరేకత

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

కూటమి ప్రభుత్వం అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలులోకి తీసుకొచ్చి కక్ష సాధింపు చర్యలకు దిగింది. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకుల మీద అడ్డగోలుగా కేసులు పెట్టి వేధించడం మొదలు పెట్టింది. ఎప్పుడో సోషల్‌మీడియాలో చంద్రబాబు, లోకేష్‌లకు వ్యతిరేకంగా పోస్టులు పెట్టారని ప్రముఖ సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ మీద కూడా కేసులు పెట్టింది. యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌పై ఏకంగా ఏడు పోలీసు స్టేషన్ల పరిధిలో కేసులు పెట్టడంపై విమర్శలు వెల్లువెత్తాయి. అలాగే వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంటు ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కర రెడ్డి మీద కూడా కేసులు పెట్టించింది. భయానక వాతావరణాన్ని సృష్టించి రాజకీయ నాయకులు, ప్రజా సంఘాలు ప్రభుత్వ వైఫల్యాల మీద మాట్లాడకుండా చేసింది. వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై భౌతిక దాడులు చేయించి భీతావహ వాతావరణాన్ని సృష్టించింది.

యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి మీద 9 కేసులు...



ఒంగోలులో చెవిరెడ్డి భాస్కర రెడ్డికి 41ఏ నోటీసులు అందజేస్తున్న పోలీసులు(ఫైల్)

యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ సంధిస్తున్న ప్రశ్నలకు కూటమి పాలకులు జవాబు ఇవ్వలేక ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు ఆయన కొరకరాని కొయ్యగా తయారయ్యారు. దాంతో ఆయనను కేసులతో భయపెట్టేందుకు పాలకులు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇందులో భాగంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని తాటిపర్తి చంద్రశేఖర్‌పై నియోజకవర్గంలో మొత్తం 9 కేసులు నమోదు చేసి 41ఏ నోటీసులు అందజేశారు. యర్రగొండపాలెం పోలీస్‌స్టేషన్‌లో 5 కేసులు, పుల్లలచెరువు పోలీస్‌స్టేషన్‌లో 1, పెద్దారవీడు పోలీస్‌స్టేషన్‌లో 2, పెద్దదోర్నాల పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసు నమోదైంది. అలాగే గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన చెవిరెడ్డి భాస్కర రెడ్డికి 6.50 లక్షల ఓట్లు వచ్చాయి. ఇది కూటమి పాలకులు జీర్ణించుకోలేక పోతున్నారు. దాంతో ఆయన మీద కూడా కేసులు పెట్టారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపై యర్రగొండపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసు నమోదు చేసి ఆయనకు 41ఏ నోటీసు అందజేశారు.



ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌కు 41ఏ నోటీసులు అందజేస్తున్న పోలీసులు(ఫైల్)

ప్రభుత్వ విధానాల మీద ప్రశ్నించినందుకు కేసు...

ఒంగోలుకు చెందిన నాని ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్. వర్క్ ఫ్రమ్ హోం చేస్తున్నాడు. విద్యావంతుడు కావడంతో సోషల్ మీడియాలో ప్రభుత్వ విధానాలను ప్రశ్నించేవాడు. ఎక్కడా అసభ్య పదజాలం కానీ, అశ్లీల పదాలు కాని ఉపయోగించేవాడు కాదు. అయినా అతడి మీద కూటమి ప్రభుత్వం కేసు నమోదు చేసింది. మూడు జిల్లాల్లో కేసులు పెట్టి ముప్పుతిప్పలు పెట్టింది. ఉద్యోగం చేసుకునేందుకు వీలు లేకుండా చేయడమే కాకుండా కేసుల మీద ఊరూరు తిరిగేలా చేసి వేధించింది. ఇదేంటని పోలీసులను ప్రశ్నిస్తే మాకేం తెలియదుపై నుంచి ఆదేశాలు అంటూ చేతులెత్తేయడంతో న్యాయ సహాయంతో అతడు కేసులను ఎదుర్కొంటున్నాడు.

ఎన్నికల్లో పోటీకి నిలబడిన ప్రజాప్రతినిధిపై కేసు...

త్రిపురాంతకం మండల పరిషత్ ఉప ఎన్నికల సమయంలో కూటమి పాలకులు వ్యవహరించిన తీరు విమర్శల పాలైంది. మండల పరిషత్‌లో ఎలాంటి బలం లేకపోయినా ఎంపీపీ పదవి కొట్టేయాలని దొడ్డిదారిలో ప్రయత్నాలు ప్రారంభించింది. వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీటీసీ ఆళ్ల ఆంజనేయ రెడ్డి బయట ఉంటే ఎన్నికల్లో గెలవలేమన్న ఉద్దేశంతో కుట్రలకు తెరదీసింది. ఆళ్ల మీద బలవంతంగా కేసు పెట్టించి జైలుకు పంపించింది.

తరువాత జరిగిన ఎన్నికల్లో ఆళ్ల ఆంజనేయ రెడ్డి సతీమణి సుబ్బమ్మ ఘనవిజయం సాధించారు. ఎన్నికల సమయంలో జరిగిన పరిణామాలు కూడా రాష్ట్రంలో పెను సంచలనం సృష్టించాయి. కూటమి ప్రభుత్వం పరువు గంగలో కలిసింది.

గుడికి వెళ్లిన అయ్యప్ప మాలధారుడి అరెస్టు...

విజయవాడ వరదల సందర్భంగా పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్లు ఆరోపణలు రావడం తెలిసిందే. అదే విషయాన్ని సత్తెనపల్లి ప్రాంతానికి చెందిన నాగిరెడ్డి సోషల్ మీడియాలో ప్రశ్నించారు. దానికి జవాబు చెప్పాల్సిన పాలకులు అందుకు విరుద్ధంగా కేసు పెట్టారు. అప్పటికే నాగిరెడ్డి అయ్యప్ప మాల వేసుకున్నాడు. పూజ చేసుకునేందుకు గుడికి వెళుతున్న నాగిరెడ్డిని మార్కాపురం పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. అలాగే విశాఖపట్నానికి చెందిన సోషల్ మీడియా కార్యకర్త రమణా రెడ్డి మీద పాదిలి పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టారు. ఆయనను అరెస్టు చేసి పాదిలికి తరలించారు.

జిల్లా వ్యాప్తంగా ఎడా పెడా కేసులు..

పుల్లలచెరువు మండలంలోని సిద్ధనపాలేనికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గడ్డం సుబ్బయ్య, యర్రగొండపాలెం మండలంలోని పాలుట్ల గిరిజన గూడెంకు చెందిన వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్త రమావత్ బాల కృష్ణనాయక్, సోషల్ మీడియా కార్యకర్తలు తుంటి నాగార్జున రెడ్డిపై పెద్దారవీడులో, వెన్నా బ్రహ్మానందరెడ్డిపై పెద్దదోర్నాల పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. కొండపి మండలంలో పెద్దకళ్లగుంట సర్పంచ్ భువనగిరి సత్యనారాయణ, గిద్దలూరు నియోజకవర్గంలోని కంభంకు చెందిన సోషల్ మీడియా యాక్టివిస్టు మెట్టు శివరామిరెడ్డి, అర్ధవీడు మండలం యాచవరంలో బోయపాటి రామకృష్ణ, అర్ధవీడు మండలం మొహిద్దీన్‌పురంలో కందుల శివశంకర్‌రెడ్డి, నారంపల్లె గ్రామానికి చెందిన జంగాల రంగస్వామిపై అక్రమ కేసు నమోదు చేశారు. మాగుటూరు గ్రామానికి చెందిన నారు అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నారు మాధవరెడ్డి, మరో 18 మంది వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై అక్రమ కేసు నమోదు చేశారు. చింతమెల్లలపాడులో ఎస్సీ కాలనీలో వైఎస్సార్ సీపీకి ఓటు వేశారని ఒకే కుటుంబానికి చెందిన వేశపోగు కళావతి, జ్వాలా, పెద్ద కాశయ్యలపై ఏడుగురు టీడీపీ వ్యక్తులు దాడి చేసి గాయపరచడమే కాకుండా పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. కనిగిరి నియోజకవర్గం సీఎస్‌పురం గ్రామానికి చెందిన మునగల హరీశ్వర్ రెడ్డి, దర్శి నియోజకవర్గంలో దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారని ముండ్లమూరు మండలం బసవాపురం గ్రామానికి చెందిన కిలారి వెంకట్రావుపై అక్రమ కేసు నమోదు చేశారు. తాళ్లూరు మండలం కొర్రపాడువారిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం సంయుక్త కార్యదర్శి విష్ణు, కొర్రపాటి శరత్‌లపై తప్పుడు కేసులు నమోదు చేసి అర్ధరాత్రి పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచక్షణా రహితంగా కొట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. దర్శి పట్టణంలో కొణతం అపర్ణ, ఆమె భర్త సురేష్ డీఎస్పీ కార్యాలయం పక్కనే డైరీపార్లర్ షాపు ఏర్పాటు చేసుకోగా కేసు నమోదు చేసి బంకు తీయించారు.

మానవ హక్కుల ఉల్లంఘనే



ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ఘోరంగా విఫలమైన ప్రభుత్వం ప్రజల మీద దాడులకు దిగుతోంది. హామీల గురించి ప్రశ్నిస్తే సహించలేకపోతోంది. కూటమి ప్రభుత్వం సామాన్య ప్రజల హక్కులను కాలరాస్తోంది. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించే వారి గొంతులు నొక్కుతోంది. ఇది ముమ్మాటికీ మానవ హక్కుల ఉల్లంఘనే. పౌరుల హక్కులను కాలరాయడమంటే రాజ్యాంగ ఉల్లంఘన కిందకు వస్తుంది. ప్రభుత్వం దమనకాండను ఆపాలి. రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడాన్ని న్యాయస్థానాల ద్వారా ఎదుర్కొంటాం, కోర్టులో ప్రైవేటు కేసులు వేసి బాధితులకు అండగా ఉంటాం.

– నగరికంటి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు

అక్రమ కేసు బనాయింపు



కొండపి మండలం పెద్దకళ్లగుంట గ్రామంలో జీర్ణావస్థలో ఉన్న గుడి స్థానంలో నూతన ఆలయాన్ని నిర్మించేందుకు గ్రామస్తులందరి సహకారంతో, వారి సమక్షంలో హిందూ సాంప్రదాయం ప్రకారం పూజలు చేసి 2022 లో పాత గుడిని పడేశాము. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడిని అయిన నన్ను ఇబ్బంది పెట్టాలని ఉద్దేశంతో గుడిని కావాలని పడవేశామని నాతో సహా పదిమంది పైన కక్షపూరితంగా అక్రమంగా కేసులు నమోదు చేయించారు. ఈ కూటమి నాయకులు రాజకీయంగా నన్ను ఎదుర్కోలేక గుడికి రాజకీయాన్ని పులుముతూ మా మీద అక్రమ కేసులు బనాయించారు.

– భువనగిరి సత్యన్నారాయణ, పెద్దకల్లగుంట సర్పంచ్

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన



కూటమి ప్రభుత్వంలో అమాయకులపై అక్రమ కేసులు బనాయించి హింసించటం పరిపాటిగా మారింది. కూటమి ప్రభుత్వ నాయకులు చేసే అరాచకాలను ప్రశ్నిస్తే వారికి బహుమతిగా కేసులు బనాయిస్తున్నారు. ఇది ముమ్మాటికీ అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. కోర్టులు ప్రభుత్వ తీరును ప్రశ్నించినా వీరికి చీమ కుట్టినట్లయినా లేదు.

– యనమల మాధవి,
వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు

చంద్రబాబుది వెన్నుపోటు చరిత్ర

- ఏడాదైనా ఒక్క పథకాన్నీ అమలు చేయని కూటమి ప్రభుత్వం
- చంద్రబాబు పాలనలో నష్టాలతో అల్లాడుతున్న రైతులు
- మహిళలు, రైతులు, నిరుద్యోగులకు వెన్నుపోటు
- అందుకే జూన్ 4ను వెన్నుపోటు దినంగా ప్రకటించిన వైఎస్సార్ సీపీ
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



'వెన్నుపోటు దినం' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ తదితరులు

ఒంగోలు సిటీ: గతంలో చంద్రబాబు వాళ్ల మామను వెన్నుపోటు పొడిచారు.. ఇప్పుడు అన్ని వర్గాల ప్రజలను వెన్నుపోటు పొడుస్తున్నారని, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి విమర్శించారు. ఒంగోలులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ జూన్ 4ను వెన్నుపోటు దినంగా ప్రకటించి జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో భారీగా ర్యాలీ, నిరసనలతో అక్కడ ఉన్న రెవెన్యూ డివిజన్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రం అందజేస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరూ కలిసి ఈ ర్యాలీలని జయప్రదం చేయాలని కోరారు. చంద్రబాబు ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ హామీలతో, కల్లబొల్లి మాటలతో ఊదరగొట్టి ఓట్లు వేయించుకున్నారన్నారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత చంద్రబాబు తాను ఏ పథకం అమలు చేయలేనని, ఆర్థిక వ్యవస్థ సరిపోదని, ఈ రాష్ట్రంలో సంపద సృష్టించడం ఎలాగో తెలియదని.. మీరంతా సలహాలివ్వండనే పరిస్థితికి వచ్చాడని.. ఇటువంటి హీనమైన నాయకుడిని ఎప్పుడూ చూడలేదని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి కింద ఒకరికి ఇస్తే.. చంద్రబాబు ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికీ రూ.15 వేల చొప్పున ఇస్తామని చెప్పి మహిళా లోకాన్ని వెన్నుపోటు పొడిచారన్నారు. 20 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, లేకుంటే నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని చెప్పారన్నారు. ఇప్పటి వరకు కనీసం 2 వేల మందికైనా ఉద్యోగాలిచ్చారా అని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి ఇవ్వకుండా వారికి వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. మహిళలందరికీ దీపం పథకం కింద ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పినా పది శాతం మందికి కూడా సబ్సిడీ డబ్బులు పడలేదన్నారు,

చంద్రబాబు పాలనలో అల్లాడుతున్న రైతులు..

కూటమి ప్రభుత్వ పాలనలో పొగాకు, వరి, కంది, పత్తి రైతులు నష్టాలతో అల్లాడుతున్నారని బూచేపల్లి విమర్శించారు. చంద్రబాబు రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తానన్న హామీ కూడా నెరవేర్చకుండా వారిని వెన్నుపోటు పొడిచారన్నారు. ఇలా చంద్రబాబు పాలనలో అన్ని వర్గాల వారినీ వెన్నుపోటు పొడుస్తూనే ఉన్నారు కనకే జూన్ 4ను వెన్నుపోటు దినంగా ప్రకటిస్తున్నామన్నారు. చంద్రబాబుకు ముఖ్యమంత్రిగా కొనసాగే అర్హత లేదన్నారు. విజయవాడలో వరదలు వచ్చిన సమయంలో సుమారు 46 మంది చనిపోయారనీ, వారిని అసలు పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. అమరావతిలో సుమారు రూ.50 వేల కోట్లు ఈ రాష్ట్ర ఖాజానాతో అభివృద్ధి చేస్తానన్నావు, బిల్డింగులు కడతానన్నావు ఎక్కడా అని ప్రశ్నించారు. అన్నీ వర్గాల ప్రజలకు అండగా ఉండాల్సిన బాధ్యత మీకుందన్నారు. పేద ప్రజలకు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అండగా ఉంటున్నామన్నారు. గత ప్రభుత్వంలో చేసిన అప్పుల కన్నా చంద్రబాబు ఏడాది పాలనలో చేసిన అప్పులే చాలా ఎక్కువన్నారు. తాము చేసిన అప్పులు సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల అకౌంట్లకు డీబీటీ ద్వారా జమచేశామని, ఇప్పుడు చంద్రబాబు చేసే అప్పులన్నీ మీ నాయకులు, కార్యకర్తలు లేదా మీరు పంచుకు తింటున్నారా అని ప్రశ్నించారు. రెడ్‌బుక్‌ను చూసి భయపడే పరిస్థితిలో ఎవరూ లేరని.. మహా అయితే అక్రమ కేసులు పెడతారని.. నాలుగు కేసులు పెట్టుకోండి అంటున్నారే తప్ప ఎవరూ భయపడే పరిస్థితులు లేవన్నారు. దళితులను, మైనారిటీలను రోడ్డు పై బహిరంగంగా చితకబాదడం దారుణమన్నారు. తప్పు చేస్తే శిక్షించాలే కానీ మా పోలీసుల జులుం, మా ప్రభుత్వ జులుం ఇంతే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారనీ విమర్శించారు. కార్యక్రమంలో జెడ్పీ చైరపర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున, మాజీ మంత్రి కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సురేష్, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరు రవిబాబు, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.రమణారెడ్డి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, కార్పొరేషన్ ఇమ్రాన్‌ఖాన్, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మీ సేవలను ఎన్నటికీ మర్చిపోలేము

● పోలీసు అధికారుల ఉద్యోగ విరమణ సభలో ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: మీ సేవలను ఎన్నటికీ మర్చిపోలేమని ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులతో ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. పోలీసు శాఖలో సుదీర్ఘకాలం సేవలందించి శనివారం రిటైరైన ఎస్బీ డీఎస్పీ ఎస్.సురేష్‌బాబు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుళ్లు ఏ వెంకటేశ్వర్లు, వీవీ భాస్కర్‌రెడ్డి, కేవీ రంగారెడ్డిని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రిటైర్‌మెంట్ అనంతరం ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, జీవితాన్ని చక్కగా తీర్చిదిద్దుకోవాలని వారికి సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, ట్రాఫిక్ సీఐ పాండురంగారావు, యర్రగొండపాలెం సీఐ ప్రభాకర్, ఆర్ఐ సీతారామిరెడ్డి, ఏఆర్ ఎస్ఐ తిరుపతిస్వామి తదితరులు పాల్గొన్నారు.

చెరువులో జారిపడి వ్యక్తి మృతి

సంతనూతలపాడు: చెరువులో జారిపడి వ్యక్తి మృతిచెందిన సంఘటన సంతనూతలపాడు మండలం ఎనికపాడులో జరిగింది. గ్రామానికి చెందిన విక్రమ్ సుధాకర్‌రావు (35) పశువులు ఈ నెల 30వ తేదీ చెరువులో దిగడంతో వాటిని బయటకు తరిమేందుకు సుధాకర్‌రావు చెరువులోకి దిగి జారిపడ్డాడు. నీటిలో మునిగి ఊపిరాడక మృతిచెందాడు. శనివారం చెరువులో మృతదేహం తేలాడుతూ కనిపించడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు పోలీసులు తరలించారు. మృతుడి భార్య శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఉదయ్‌కుమార్ తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

అర్ధవీడు: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అర్ధవీడు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డులో గల సంఘపేట కాలనీలో శనివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. కాలనీలో నివాసం ఉంటున్న షేక్ మాబువలి (40) డ్రైవర్‌గా పనిచేస్తూ తన భార్య జుమాబీ, ముగ్గురు పిల్లలతో కలిసి జీవిస్తున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు పాల్పడటంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అర్ధవీడు ఎస్సై బీ మధుసూదన యాదవ్ తెలిపారు. చిన్న పిల్లలు కావడంతో మృతుడి ఇంట తీవ్ర విషాదం అలముకుంది.

● అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దిశగా ముందుకు సాగాలి
● జెడ్పీ సర్వసభ్య సమావేశంలో చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పిలుపు


సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, ఉగ్ర, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, అధికారులు

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యం

ఒంగోలు సిటీ:

జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పిలుపునిచ్చారు. ఆమె అధ్యక్షతన స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. గ్రామీణ నీటి సరఫరా, డ్వామా, డీఆర్‌డీఏ, విద్య, వ్యవసాయం, ఉద్యానవన శాఖల ద్వారా అందుతున్న సేవల గురించి వివరించారు. చట్టసభ సభ్యులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ సూచించారు. ముందుగా పహల్గాం ఉగ్ర దాడిలో అమరులైన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.

బాధిత రైతుకు పరిహారం అందించాలి : యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని గురిజేపల్లిలో గుర్తు తెలియని వ్యక్తులు బొప్పాయి పంటను నష్టపరిచారని, బాధిత రైతుకు పరిహారం అందేలా చూడాలని అధికారులను కోరారు. యర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి నేరుగా బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పునరావాస ప్యాకేజీ జాబితాలో 320 మంది పేర్లు లేవని, పరిశీలించి వాటిని చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధి హామీ పథకంలో అర్హులకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు.

ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ రక్షిత మంచినీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు సక్రమంగా పనిచేసేలా పర్యవేక్షించాలని సూచించారు. రాష్ట్రంలో జలజీవన్ మిషన్ పనులను పూర్తి చేసే గడువును 2028 వరకు పెంచినందున ఆయా పనులను వేగవంతం చేయాలని చెప్పారు. రైతుల వద్ద పొగాకు నిల్వలు భారీగా ఉన్నందున మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేలా చూడాలని అధికారులకు సూచించారు. కొత్త జెడ్పీ సమావేశ మందిరం నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని కోరారు. కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలో ఫ్లోరైడ్ సమస్యకు తోడు సాగర్‌నీటిని పంపిణీ చేసే పైపులైన్లు దెబ్బతిన్నందున కొత్త పైపులైన్లు వేయాల్సిన అవసరం ఉందన్నారు. అర్హులందరికీ పెన్షన్లు అందేలా చూడాలన్నారు. హనుమంతునిపాడు మండలంలో తక్కువ వర్షపాతం నమోదైనా కరువు మండలంగా ప్రకటించలేదని, పున:పరిశీలన చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అధికారులకు చెప్పారు. సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ తన నియోజకవర్గంలో సీపీడబ్ల్యూఎస్ పథకాల నిర్వహణపై మరింత దృష్టి పెట్టాలని అధికారులను కోరారు. రామతీర్థం, గుండ్లకమ్మ కాలువలను బాగుచేయించాలని సూచించారు. సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు. జూన్ నెలాఖరుకు పూర్తి చేయకపోతే నిజమైన లబ్ధిదారులకు ప్రయోజనం ఉండదన్నారు.


జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

పలు సమస్యలు ఏకరువు పెట్టిన జెడ్పీటీసీలు, ఎంపీపీలు...

పలువురు జెడ్పీటీసీలు, ఎంపీపీలు అనేక సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. స్కూళ్లలో విద్యాహక్కు చట్టం పకడ్బందీగా అమలయ్యే విధంగా చూడాలని కోరారు. చీమకుర్తి బాలికల హాస్టల్లో భోజనం నాణ్యంగా లేదని, వర్కర్లు దారుణంగా మాట్లాడుతున్నారని, ఈ సమస్యపై దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామాల్లో ఫ్లోరైడ్ నీటి సమస్యను పరిష్కరించాలని, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసిన వారికి పెండింగ్ బిల్లులు చెల్లించేలా చూడాలని అధికారులను కోరారు. రామతీర్థం ప్రాజెక్టుకు వెళ్లే దారిలో ఉన్న ముళ్లచెట్లను తొలగించాలని, శ్మశానాలలో ముళ్లచెట్లను తొలగించి చుట్టూ ప్రహరీ నిర్మించాలని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మండలాల్లో ఆధార్ కేంద్రాల సంఖ్య పెంచాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి : జేసీ గోపాలకృష్ణ

జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యాహక్కుచట్టం అమలు, అర్హతలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పునరావాస ప్యాకేజీ జాబితాలో పేర్లు లేని వారి అర్హతను పరిశీలించేందుకు గ్రామసభలు పెట్టామన్నారు. అర్హులకు న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రస్తుతం నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొని యోగా సాధన చేయాలని పిలుపునిచ్చారు. కరోనా కేసులు పెరుగుతున్నందున రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జెడ్పీ సీఈఓ చిరంజీవి మాట్లాడుతూ స్టాండింగ్ కమిటీ సవరించిన మార్గదర్శకాల మేరకు, మండల పరిషత్ ఆమోదించే పనుల అంచనాల విలువను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు, జిల్లా పరిషత్ ఆమోదించే పనుల అంచనాల విలువను రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ప్రభుత్వం పెంచిందన్నారు. కొత్త జెడ్పీ సమావేశ మందిరం నిర్మాణానికి గతంలో రూపొందించిన రూ.20 కోట్ల అంచనాలను సవరించేందుకు గత రెండు స్టాండింగ్ కమిటీలలో ఆమోదించిన 350 ప్రతిపాదనలకు కూడా సమావేశంలో సభ్యులు ఆమోదం తెలిపారు. బాపట్ల, నెల్లూరు జిల్లాల డీఆర్వోలు గంగాధరగౌడ్, ఉదయభాస్కర్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు సమావేశంలో పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం ద్వారా పని కల్పించడం లేదు : దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

జెడ్పీ సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డులు కలిగిన వారందరికీ పని ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. ఉన్న జాబ్‌కార్డుల్లో యాభై శాతం మందికి కూడా పని కల్పించడం లేదన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాల వారికి పని కల్పించడం కోసమే ఉపాధి హామీ పథకం ఉందన్నారు. కానీ, అధికారులను అడిగినా పని కల్పించడం లేదన్నారు. కింది స్థాయిలో ఇబ్బందిపెడుతున్నారని, అటువంటివి లేకుండా అందరికీ పని కల్పించాలని కోరారు. తన నియోజకవర్గంలో పంటలు నష్టపోయిన ఉద్యానవన రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

చంద్రబాబు నయవంచనను

ఎండగడదాం

● 4న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం
● వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఆ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేరుగు నాగార్జున పిలుపు

సంతనూతలపాడు: కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్నప్పటికీ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చకుండా సీఎం చంద్రబాబు చేసిన నయవంచనను ఎండగట్టాలని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దీనిపై వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ సంతనూతలపాడు మండల కేంద్రంలో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సంతనూతలపాడులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం పార్టీ మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో చంద్రబాబు సూపర్ సిక్స్ హామీల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చి ఏడాదైనా నేటికీ ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా దగా చేశాడంటూ మేరుగు నాగార్జున ధ్వజమెత్తారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించారన్నారు. ప్రస్తుతం చంద్రబాబు ఏడాది పాలన చూసి మోసపోయామని గ్రహించిన ప్రజలు.. కూటమిని గెలిపించి తప్పు చేశామని పశ్చాత్తాపానికి గురవుతున్నారన్నారు. చంద్రబాబు మోసాన్ని, నయవంచనను నిలదీసేందుకు జూన్ 4న వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నామని మేరుగు నాగార్జున వెల్లడించారు.

ఇచ్చిన హామీలు ఏమయ్యాయి..?

ఇచ్చిన హామీలు ఏమయ్యాయి.. ఎందుకు నెరవేర్చలేదో చంద్రబాబు చెప్పాలని మేరుగు నాగార్జున డిమాండ్ చేశారు. ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం పథకం పేరుతో ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని ఇంత వరకు అమలుచేయలేదన్నారు. అన్నదాత సుఖీభవ పేరుతో రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని ఇంత వరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. 18 ఏళ్లు నిండిన యువతులకు ఆడ బిడ్డ నిధి కింద నెలకు రూ.1500 ఇస్తామన్నారని, మహిళలకు ఉచిత బస్సు అన్నారని, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెప్పారని, కానీ, అవన్నీ ఏమయ్యాయని నిలదీశారు. యువగళంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని, అధికారం చేపట్టి ఏడాదైనా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. నిరుద్యోగులకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. వలంటీర్లకు రూ.10 వేల గౌరవ వేతనం ఇస్తామని వారిని అసలు లేకుండా చేశారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఐదేళ్ల పాటు ఇంటింటికి రేషన్ అందించామని, చంద్రబాబు ఎండీయూ వాహనాలను రద్దు చేసి ఇంటి వద్దకే రేషన్ అందకుండా చేస్తున్నారని మండిపడ్డారు. ఏడాదైనా కొత్త పింఛన్ ఒక్కటి కూడా ఇవ్వలేదని, ఉన్న పింఛన్లు తొలగించడం బాధాకరమని అన్నారు. వీటన్నింటికి నిరసనగా నిర్వహించనున్న వెన్నుపోటు దినం ర్యాలీలో చంద్రబాబు చేతిలో మోసపోయిన మహిళలు, రైతులు, నిరుద్యోగులు, వలంటీర్లు భారీగా పాల్గొనాలని మేరుగు నాగార్జున పిలుపునిచ్చారు. సమావేశానికి వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి అధ్యక్షత వహించగా, పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, సొసైటీ మాజీ అధ్యక్షుడు దుంపా యలమందారెడ్డి, నాయకుడు రావూరి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీలు కే వెంకటేశ్వరరావు, కే సుబ్బారావు, వి.కోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి మేరుగు నాగార్జున

రోడ్డెక్కిన పొగాకు రైతు

● వేలం బహిష్కరించి రాస్తారోకో
● అధిక సంఖ్యలో మీడియం గ్రేడ్ బేళ్లను తిరస్కరిస్తున్నారంటూ ఆందోళన
● అన్ని బేళ్లను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్


రైతులతో మాట్లాడుతున్న వేలం నిర్వహణాధికారి సునీల్‌కుమార్

కొండపి: వ్యాపారుల ధోరణితో పొగాకు రైతుల సహనం నశించింది. రోడ్డెక్కి రాస్తారోకో చేసేందుకు దారితీసింది. కొండపిలోని పొగాకు వేలం కేంద్రంలో శనివారం మూగచింతల, నెన్నూరుపాడు, గురప్పడియా, కే అగ్రహారం, చతుకుపాడు గ్రామాల రైతులు బేళ్లను వేలానికి తీసుకొచ్చారు. కొనుగోలు ప్రారంభం నుంచి డిస్‌ప్లే బోర్డుపై ధరలు కనిపించాల్సి ఉండగా, ఒక లైను పొగాకు కొనుగోలయ్యేంత వరకు ధరలు కనిపించలేదు. వేలం ప్రారంభంలో లో గ్రేడ్ పొగాకు కొనుగోలు చేశారని, వేలం కొనసాగుతున్నకొద్దీ ఎఫ్-3 పొగాకు బేళ్లను నో బిడ్లుగా చూపిస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వేలాన్ని బహిష్కరించి బయటకు వెళ్లారు. అనంతరం రైతులతో వేలం నిర్వహణ అధికారి మాట్లాడి వేలం కొనసాగించడానికి ప్రయత్నించారు. లోపలికి వెళ్లిన రైతులు అదే పరిస్థితి కొనసాగడంతో బయ్యర్లతో వాగ్వాదానికి దిగి వేలాన్ని బహిష్కరించి బయటికి వచ్చేశారు. అనంతరం రైతులు కొండపి, టంగుటూరు రోడ్డులో ధర్నాకు దిగి ఆందోళన వ్యక్తం చేశారు. వేలం నిర్వహణ అధికారి రైతుల పక్షాన నిలిచి వ్యాపారులతో మాట్లాడి గిట్టుబాటు ధర కల్పించాలని, బేళ్ల కొనుగోలును ప్రారంభించాలని నినాదాలు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి పొగాకు రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో స్థానిక ఎస్సై ప్రేమ్‌కుమార్ తన సిబ్బందితో అక్కడకు చేరుకుని రైతులతో మాట్లాడారు. వేలం నిర్వహణ అధికారితో చర్చించి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. వేలం నిర్వహణ అధికారి దగ్గరికి మీరు కూడా రావాలని ఎస్ఐని రైతులు కోరగా, అందుకు అంగీకరించడంతో రైతులు ధర్నాను విరమించారు.

రైతును బట్టి ధరలా..?

వేలం కేంద్రంలో రైతును బట్టి గ్రేడ్, ధరలు నిర్ణయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మంచి ధర కల్పించాలని నిలదీస్తే అటువంటి రైతును టార్గెట్ చేసి ధర తగ్గిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేలం అధికారులతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్న రైతులకు మంచి గ్రేడ్లు, ధర ఇస్తున్నారన్నారు. అటువంటి వారిపై చర్యలు తీసుకుని రైతులందరికీ గ్రేడ్లను బట్టి మంచి ధరలు దక్కే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధర కల్పించాలి...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే దిగివచ్చి పొగాకు రైతులకు మద్దతు ధర ఇవ్వాలని రైతు కూలీ సంఘ కార్యదర్శి లలిత కుమారి, సహాయ కార్యదర్శి పరిటాల కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. రైతులకు మద్దతుగా నిలిచి రోడ్డుపై వారు బైఠాయించారు. ప్రభుత్వం వెంటనే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి రైతులకు మద్దతు ధర కల్పించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఎట్టకేలకు ప్రారంభమైన వేలం...

రైతులతో పలు దఫాలుగా పొగాకు వేలం కేంద్రం నిర్వహణ అధికారి చర్చలు జరిపిన అనంతరం గిట్టుబాటు ధర కల్పించే విధంగా బయ్యర్లతో మాట్లాడతానని హామీ ఇవ్వడంతో రైతులు అంగీకరించి వేలానికి మొగ్గుచూపారు. అనంతరం ఆగిన చోట నుంచి వేలం ప్రారంభమైంది. ఆందోళనలతో కాకుండా చర్చలతోనే సమస్యలు పరిష్కరించుకోవాలని రైతులకు వేలం నిర్వహణ అధికారి సూచించారు.


వేలానికి రైతులు తీసుకొచ్చిన బేళ్లు


పొగాకు వేలాన్ని బహిష్కరించి బయటకు వస్తున్న రైతులు

ఆగి ఉన్న లారీని ఢీకొని వ్యక్తి మృతి

మార్కాపురం: ఆగి ఉన్న లారీని ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన శనివారం సాయంత్రం మార్కాపురం మండలంలోని కుంట - చింతగుంట్ల గ్రామాల మధ్య జరిగింది. రూరల్ ఎస్సై అంకమరావు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి అనంతపురం వెళ్తున్న లారీకి టైరు పంక్చర్ కావడంతో కుంట - చింతగుంట్ల గ్రామాల మధ్య రోడ్డు పక్కన ఆపి ఉంది. టైరుకు పంక్చర్ వేసుకుంటుండగా, మార్కాపురం సబ్‌స్టేషన్‌లో హెల్పర్‌గా పనిచేసే తిప్పాయపాలేనికి చెందిన కుందురు చిన్న నారాయణరెడ్డి (32) ఇంటికి వెళ్తూ ఏమరపాటుతో ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి రెండు సంవత్సరాల క్రితమే వివాహమైంది. సంఘటన స్థలానికి చేరుకున్న భార్య, తల్లిదండ్రుల రోదనలు చూపరులతో సైతం కంటతడి పెట్టించాయి. రూరల్ ఎస్సై అంకమరావు, ఏఎస్సై శ్రీనివాసరావు సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

ఒంగోలు: స్థానిక మినీ స్టేడియంలో 12వ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి శనివారం క్రీడా జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులంతా క్రీడా స్ఫూర్తి ప్రదర్శిస్తూ విజేతలుగా నిలిచేందుకు కృషిచేయాలన్నారు. జిల్లా క్రీడాభివృద్ధి శాఖాధికారి జి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ మూడు రోజులపాటు ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. జిల్లా కార్యదర్శి జి.భక్తధృవుడు మాట్లాడుతూ సబ్‌జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్, మాస్టర్స్ విభాగాలలో పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో పవర్ లిఫ్టింగ్ సౌత్‌జోన్ అసోసియేషన్ అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఎస్.కోటేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు ప్రభాకరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వందల కోట్లకు లూపిక్స్ టోపీ

● యానిమేషన్ వ్యాపారం పేరుతో మాయమాటలు
● రూపాయికి రూపాయి లాభమంటూ ప్రచారం
● జిల్లాలో 8 మంది బాధితులు
● ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్లో ఫిర్యాదుతో కేసు నమోదు
● విచారణాధికారిగా యర్రగొండపాలెం సీఐ

ఒంగోలు టౌన్: తెలుగు సినిమాలో గ్రాఫిక్స్‌కు సంబంధించి యానిమేషన్ వ్యాపారంలో పెట్టుబడులుపెడితే రెట్టింపు లాభాలు వస్తాయని మాయమాటలు చెప్పి కోట్లాది రూపాయలు వసూలు చేసిన ఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తోంది. విజయవాడకు చెందిన కిరణ్, అతడి కుటుంబ సభ్యులు 2014లో లూపిక్స్ పేరుతో ఓ యానిమేషన్ కంపెనీ పెట్టారు. తమ కంపెనీ తెలుగు సినిమాలతో పాటుగా వివిధ భాషల సినిమాలకు గ్రాఫిక్స్ చేస్తోందని, ఇందులో పెట్టుబడులు పెడితే రూపాయికి రూపాయి లాభం వస్తుందని నమ్మబలికారు. 2022 వరకు కొంతమందికి డబ్బు చెల్లించాడు. కానీ, ఆ తర్వాత డబ్బు చెల్లించడం ఆపేశాడు. జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు విజయవాడ, గుంటూరు, వైజాగ్ తదితర జిల్లాలలో కోట్ల రూపాయలు వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఒంగోలుకు చెందిన ఆత్మకూరి అమరలింగేశ్వరరావు ఈ ప్రాజెక్టులో సుమారు రూ.5 కోట్ల వరకు పెట్టుబడి పెట్టినట్లు సమాచారం. తన పెట్టుబడికి ఎలాంటి రిటర్న్స్ రాకపోవడంతో ఇటీవల ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఆయన ఒంగోలు తాలూకా పోలీసు స్టేషన్‌కు సిఫార్సు చేయడంతో కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో జిల్లాలోని యర్రగొండపాలేనికి చెందిన వారు ఎక్కువగా ఉన్నట్లు తేలింది. జిల్లాలో 80 మందికిపైగా భారీగా పెట్టుబడులు పెట్టినట్లు సమాచారం. దాంతో ఈ కేసు విచారణాధికారిగా యర్రగొండపాలెం సీఐ ప్రభాకరరావును నియమించారు. ఆయన గత కొన్ని రోజులుగా విజయవాడకు చెందిన కిరణ్ కోసం గాలిస్తున్నట్లు సమాచారం. యర్రగొండపాలెంకు చెందిన కొందరు బాధితులు కిరణ్ ఉత్తరాఖండ్‌లోని రిషికేష్‌లో ఉన్నట్లు తెలుసుకుని పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. అక్కడకు వెళ్లిన యర్రగొండపాలెం సీఐ.. కిరణ్‌కు నోటీసులు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఇదిలా ఉండగా కిరణ్‌ను ఇప్పటికే అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఏ మేరకు స్కాం జరిగింది. ఎన్ని కోట్ల రూపాయలు వసూలు చేశారు. ఎక్కడెక్కడ వసూలు చేశారన్న విషయాలపై విచారిస్తున్నట్లు సమాచారం. మొత్తం మీద రాష్ట్రంలో ఇదో పెద్ద కుంభకోణంగా మారే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. సుమారు 500 కోట్ల రూపాయలకుపైగా ప్రజల నుంచి డబ్బు వసూలు చేసినట్లు సమాచారం.

సమాచారశాఖ ఉద్యోగికి ఘనంగా వీడ్కోలు


ఇందిరాకుమారిని సన్మానిస్తున్న సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది

ఒంగోలు సబర్బన్: సమాచారశాఖలో సుమారు 38 ఏళ్లపాటు టైపిస్టుగా విధులు నిర్వర్తించి శనివారం ఉద్యోగ విరమణ పొందిన ఓ ఇందిరాకుమారిని సమాచార, పౌర సంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీఐపీఆర్‌ఓ వేణుగోపాల్, డీపీఆర్‌ఓ రమేష్, డివిజినల్ పీఆర్‌ఓ దుర్గాప్రసాద్, రిటైర్డ్ డీఈఐఈ రమణమూర్తి, రిటైర్డ్ డీపీఆర్‌ఓ నారాయణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. మార్కాపురం డివిజన్ కార్యాలయంతో పాటు ఒంగోలులోని జిల్లా కార్యాలయంలో పనిచేసిన ఇందిరాకుమారి సేవలను కొనియాడారు.